# అ(బొ)మ్మ

**-బత్తుల వెంకట దుర్గాప్రసాదరావు**

రాజు షాపుకు వెళ్ళాను. అతడు, నేను బి.కాం. చేశాం. నాకు ఒక ప్రయివేటు కంపెనీలో ఉద్యోగం వచ్చింది. అతడు ఉద్యోగం రాక బ్యాంక్ లోన్‌తో 'బేబీ గుడ్స్' షాపు పెట్టాడు.

రోజూ సాయంకాలం వేళ అతడి షాపుకెళ్ళి కొంత సేపు వాడితో కలిసి ఉంటాను.

రాజు కౌంటర్‌లో ఉన్నాడు. పలకరింపుగా నన్ను చూసి నవ్వేశాడు. వాడికి ఎదురుగా స్టూల్ మీద కూర్చున్నాను.

ఇద్దరం మాట్లాడుకుంటున్నాం.

అంతలోనే ఒక కారు వచ్చి షాపు ముందు ఆగింది. ఇద్దరం ఒకేమారు అటు చూశాం.

ఆ కారులో నించి ఒకావిడ దిగింది. ఆమె వాటంబట్టి ఆవిడ గొప్పింటి మనిషిలా తోచింది. ఆవిడ వెంట ఒక సాధారణ మనిషి దిగింది. ఆమె చేతిలో రబ్బరు బొమ్మలాంటి బిడ్డ ఉంది. బహుశా ఆ మనిషి ఆయా లేదా పనిమనిషి కావచ్చు.

ఆ ఇద్దరూ షాపులోకి వచ్చారు.

సహజంగా అటువంటి కష్టమర్ వచ్చినప్పుడు షాపు యజమాని రియాక్షన్ ఎలా ఉంటుందో నాకు తెలుసు.

రాజు లేచి "రండి మేడమ్" అంటూ ఆవిడను ఆహ్వానించాడు.

ఆవిడ ఏదో అడిగింది. అవి చూపించమని సేల్స్ గర్ల్స్‌ను పురమాయించాడు రాజు హడావిడిగా.

తనకు కావలసినవి అడిగి చూస్తోందావిడ. సహనంతో సేల్స్ గర్ల్స్ ఆవిడకు సహాయపడుతున్నారు.

అప్పుడు బయట గోలగా అనిపిస్తే నేను అటు చూశాను.

ఒక చిన్న బిడ్డ ఏడుస్తోంది. ఆ బిడ్డను ఎత్తుకున్న ఆసామీ ఆ బిడ్డను ఓదార్చడానికి ప్రయత్నిస్తున్నాడు. ఆ బిడ్డకు షాపు షోకేస్‌లో బయటకు అగుపిస్తున్న బొమ్మలు చూపిస్తూ.

ఆ బిడ్డ ఏడుపు ఆపడంలేదు.

ఆ షాపు ముందు ఆ గలభాకు షాపులోని వారంతా పనులు ఆపి అటే చూస్తున్నారు.

ఆ గొప్పింటావిడ షాపులో అటూ ఇటూ కదులు తోంది.

"ఆయా పాపను ఇలా తీసుకురా" అంది దర్పంగా.

ఆ ఆయా ఆవిడ చెంతకు వెళ్ళింది.

"పాపా ఈ బొమ్మ కావాలా" అనడిగిందావిడ తన చేతిలోని బొమ్మను పాపకు చూపుతూ. ఆ పాప ఆ బొమ్మను అమాంతంగా లాక్కుంది.

"ప్రసాద్, వాళ్లను పొమ్మను. కొనలేరు. పిల్లలకు మాత్రం ఆ బొమ్మలు చూపించి ఏడిపిస్తారాయే. కల్చర్‌లెస్ బ్రూట్స్" అనేశాడు రాజు అసహనంగా నాతో.

నేను అటు కదిలాను. వాళ్ళను వెళ్ళమన్నాను. వాళ్ళు ఇంకా కదలడంలేదు. ఆ బిడ్డ ఏడుస్తూనే ఉంది.

"ఈ బొమ్మ ఎంత?" అడిగాడు ఆ బిడ్డను ఎత్తుకున్న అతడు నన్ను.

ఆ బొమ్మను చూసి, రాజు వద్దకు వచ్చి దానిని చూపిస్తూ ఖరీదు అడిగాను.

"వాడేం కొంటాడు. పొమ్మను. రాని బేరం" అన్నాడు రాజు చిరాగ్గా.

ఆ బిడ్డ ఏడుస్తూనే ఉంది.

అప్పుడే షాపులో ఆవిడ- "ఆ బొమ్మ ఖరీదు ఎంతో చెప్పవచ్చుగా" అంది రాజుతో.

"లేదు మేడమ్, వాళ్ళ మొహం. కొనేది లేదు, ఏడ్చేది లేదు. టైం వేస్ట్" అన్నాడు రాజు చిరాకుగా.

"సర్లే.. నాకు కావాలి, ఎంతో చెప్పండి" అంది ఆవిడ.

రాజు చెప్పాడు.

బయట బిడ్డ ఏడుస్తూనే ఉంది.

"అది ఇవ్వండి" అంది ఆవిడ.

సేల్స్‌గర్ల్‌తో తీయించి తెప్పించాడు రాజు ఆ బొమ్మను.

ఆవిడ ఆ బొమ్మను తీసుకొని ఏడుస్తున్న ఆ బిడ్డవైపు కదిలింది. ఆ బిడ్డ చేతిలో బొమ్మ పెట్టింది. ఆ బిడ్డ బొమ్మతో ఆడుకుంటూ ఏడుపు ఆపేసింది.

"అమ్మా ఎంతమ్మా" అడిగాడు ఆ బిడ్డను ఎత్తుకున్నతను.

"నీ దగ్గర ఎంత ఉంది?" అడిగింది ఆవిడ.

"పాతిక" చెప్పాడతను.

"పదిహేను రూపాయలు" చెప్పింది.

"తగ్గదమ్మా" అడిగాడతను.

"ఎంతిస్తావు?"

"పది"

"ఇవ్వు" అందావిడ టక్కున.

రాజుకు ఆ నోటు ఇస్తూ "మిగతాది నా బిల్లులో చూపించు" అంది ఆవిడ.

ఆ బొమ్మ ఖరీదు అక్షరాలా నాలుగు వందల రూపాయలు. ■

## కన్నీళ్ళు

నీళ్ళలో / నిజాయితీ వుంటుంది
అవి కళ్ళనే అంటిపెట్టుకుంటాయి
కోపంలో / ప్రేమతత్వం వుంటుంది
అది గుండెనే అంటిపెట్టుకుంటుంది

## మార్పు

ఖంలో మార్పులేకున్నా
వెలుతురులోనూ, దీపకాంతిలోనూ
వేర్వేరుగా కనిపిస్తుంది/మనసులో తేడా లేకున్నా
మనిషి మనిషికీ / ఒక్కో విధంగా కనిపిస్తుంది

**-శైలజామిత్ర**

## మాతృ హృదయం

దయానికి అమృతం సోకి
జీవన పరిమాణం వృద్ధిచెందినట్టు
పురిటి శిశువు కేరింతల్లో
ముద్దు ముద్దెర్ల చొక్కాలు తొడిగి
నవ్వుల రతనాలను ఏరుకుంటుంది తల్లి
దేగ దృష్టికి / కవాటాలు తొడిగినట్టు
అడ్డు తెరల్లో / గడ్డిపోచ భవనం కట్టి
రెక్కల గూడుగుల్లో
రక్షణ భారాన్ని ఎత్తుకొని
ఉష్ణ నిష్పత్తిని / నిర్ణీత కాలంలో
శాబకాలకు సమకూర్చుతుంది తల్లి పక్షి
గొంతు గోడల్లోకి
సూక్ష్మాహారాన్ని అందిస్తూ
ముక్కు రాపిళ్ళతో మురిసిపోతూ
విడిపడిన తన విభాగాల కోసం
కరిచే కాలాన్ని చూచి
ప్రాణాలు సైతం ఫణంగా పెడుతుంది
శైశవంలో సంరక్షణార్థమై
ప్రకృతి నిశిత పరిశీలన లోంచి
వడగార్చి వడ్డించిన సంపత్తిగా
విశ్వంలో విరాజిల్లుతుంది తల్లిప్రేమ
ఇది హిమనగోన్నతం
ప్రాణ సమృద్ధి సందర్శనం

## కాలనాగు

క్రుడో కాలనాగు / విషం కక్కితే
వానకో... వరదకో
నిర్మలమైన నీరంతా చెడిపోయింది
బకములు బాతులు కలహంసలు
ఒకటేమిటి / జలచరాలన్నీ
అలలపై అచేతనంగా తేలియాడి
కలువ పూలను కప్పేసి
వెన్నెలను వెక్కిరించాయి
ఇది భ్రమ కాదు
కల అసలే కాదు
ప్రకృతిలోని ప్రత్యక్ష వినాశకర చర్య
పొడుగు బారెడే కాని
తక్షకుని కంటె తల విస్తారమైనది
పడగ చూస్తేనే పాముకాని
రూపురేఖలన్నీ నరుడివే
వీక్షిస్తే విచారపడే దుర్ఘటనలెన్నో
బ్రతికిస్తే భవిష్యత్తులో బాధలెన్నో
అందుకేనేమో
ఆకాశ బోయడు అరుదెంచి
తల తన చేతితో నొక్కాడో
బల్లెం బలంగా విసిరాడో
నాగు నాశమై పోయింది
తాకితే నీరంతా
తేటగా మారింది.

(నరరూప నాగులను దేవుడు శిక్షిస్తాడనే భావనతో)

**-పూట్ల భద్రయ్య**